క్లుప్తంగా

మతప్రచారం అడ్డగింత

దుమ్ముగూడెం: పంచాయతీలోని పరిధిలోని గ్రామాల్లో ఆదివారం రాత్రి తమ మత ప్రచారం నిర్వహించుకుంటున్న కొందరిని పంచాయతీలోని యువకులు అడ్డుకున్నారు. కొంతమంది వ్యక్తులు ద్విచక్ర వాహనంపై మైక్ ఏర్పాటు చేసుకుని సీతానగరం, గోవిందాపురం గ్రామాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వారిని గ్రామంలోని కొందరు యువకులు అడ్డుకున్నారు. ప్రచారం చేసుకోవడానికి తమకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని చెప్పినప్పటికీ యువకులు అంగీకరించలేదు. క్రమంగా గ్రామంలోని మరికొందరు వారితో వారించసాగారు. దీంతో ప్రచారకులు వెనుదిరిగి వెళ్లారు.

న్యాయం చేయాలి

అశ్వాపురం: పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ప్రాధాన్యం ఇస్తూ రెండు స్థానాలు మాదిగలు కేటాయించి న్యాయం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అశ్వాపురంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని గత మూడు సంవత్సరాలుగా కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ఉస్మానియా యూనివర్శిటీ ఉద్యమ నాయకుడు పిడమర్తి రవికి త్వరలో జరగనున్న కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్ స్థానాలలో మాదిగలకు రెండు స్థానాలు కేటాయించాలన్నారు.

ప్రెస్ క్లబ్ ఎన్నిక

గుండాల: గుండాల మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా యాసారపు తిరుపతి, కార్యదర్శిగా తవిడిశెట్టి నాగరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ సమావేశం, నూతన కమిటీ వేయడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కోడూరు పాపచారి, ఉపాధ్యక్షులుగా ఎండి.యాకూబ్, సహాయ కార్యదర్శిగా మార్తా రామకృష్ణ లను ఎన్నుకోవడం జరిగింది. వీరితోపాటు కమిటీ సభ్యులుగా యాసారపు యాకయ్య, మాచర్ల రంజిత్, గడ్డం నారాయణ, పెండేకట్ల సత్యం జాడి రాజు, సారంగపాణి, జావిద్, రాచకొండ సంతోష్, మాచర్ల వంశీ రాజ్, ఊకే రామకృష్ణ తదితరులను ఎన్నుకున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మణుగూరురూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మణుగూరు ఎస్సై రాజేష్‌కుమార్ అన్నారు. మణుగూరు పట్టణంలోని పూలమార్కెట్ సెంటర్‌లో ఎస్సై తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను నిలిపి సంబంధిత ధృవపత్రాలను పరిశీలించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు, ధృవపత్రాలు లేని వారికి ఈ జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు వినియోగించాలని సూచించారు. తప్పని సరిగా ధృవపత్రాలు ఉండాలన్నారు.

పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరాగా వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ తాలిపేరు ప్రాజెక్టు, కలివేరుక్రాస్‌రోడ్, దానవాయిపేట తదితర ప్రాంతాలలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చిపోయే వారిని ఆపి తనిఖీ చేశారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలు నిర్వహించారు.

గోటి తలంబ్రాలతో పాదయాత్ర

చర్లరూరల్: సీతారాముల కల్యాణ మహోత్సవానికి చర్లలోని సీతారామ లక్ష్మణ భక్త ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఆదివారం భక్తులు గోటితో వొలిచిన తలంబ్రాలను భద్రాచలంలోని శ్రీ రామ చంద్రుని ఆలయం వద్దకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఎంతో భక్తి శ్రద్ధలతో శిరస్సుపై తలంబ్రాలను తీసుకుని శ్రీరామ భక్తి గీతాలను ఆలపిస్తూ వెళ్లారు. కార్యక్రమంలో పెద్దాడ ఆశాలత, పాశికంటి శ్రీదేవి, మచ్చా వీర్రాజు, గొంది శోభన్, ఇందల రమేష్, ఇందల బుచ్చిబాబు, ఎడారి పుష్పావతి, ఎడారి రమాదేవి, వరలక్ష్మి, పంజా అనసూయ, చింతూరి సరోజిని, నాంపల్లి సత్యవతి, మచ్చా సత్యవతి పాల్గొన్నారు.

కూలి డబ్బులు చెల్లించాలి

అశ్వాపురం: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు మూడు నెలలుగా డబ్బులు రాక ఇబ్బంది పడుతున్నారని సీపీఎం మండల నాయకుడు దండి రాములు అన్నారు. మల్లెల మడుగులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే కూలి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- బోర్డులకే పరిమితమైన ఆట స్థలాలు
- మూలనపడ్డ క్రీడా సామగ్రి
- క్రీడాకారులకు ప్రోత్సాహం కరువు



ఇరవెండిలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

బూర్గంపాడు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామాలలోని ప్రభుత్వ భూములలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడా మైదానాల వద్ద పెద్ద బోర్డులను ఏర్పాటు చేసింది. ఆటల నిర్వహణకు అవసరమైన సామగ్రిని కూడా గతేడాది సెప్టెంబర్‌లో గ్రామపంచాయతీలకు ప్రభుత్వం అందించింది.అటలు ఆడించేందుకు కోచ్‌లు లేకపోవటంతో ప్రభుత్వ లక్ష్యం కుంటుపడింది. కొన్ని గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు వడ్లు ఆరబోసుకునేందుకు, గొర్రెలు, మేకలు నిలుపుకునేందుకు వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు పెట్టుకునేందుకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వం అందించిన క్రీడా సామగ్రి గ్రామపంచాయతీ కార్యాలయాల్లో మూలన పడివుంది. కొన్ని గ్రామపంచాయతీలలో క్రీడా సామగ్రి కూడా మాయమైంది. ఈ క్రీడాసామగ్రిని కొందరు తస్కరించినట్లుగా సమాచారం.

అక్కరకురాని మైదానాలు, కిట్లు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామాలలోని ప్రభుత్వభూమిని గుర్తించారు. రెవెన్యూ అధికారులు గ్రామాలలో ప్రభుత్వ భూమిని గుర్తించి సర్వే చేసి క్రీడా మైదానాలకు కేటాయించారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఆ భూములను చదును చేసి క్రీడా ప్రాంగణమని పెద్దపెద్ద బోర్డులను ఏర్పాటు చేశారు. అక్కడకక్కడ క్రీడా సామగ్రిని ప్రాంగణాలలో ఏర్పాటు చేశారు. అక్కడ ఎలాంటి ఆటలు ఆడించకపోవటంతో ఆ ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. చదును చేసి శుభ్రం చేసిన క్రీడాప్రాంగణాలు ప్రస్తుతం పిచ్చిమొక్కలు, కంప మొక్కలు పెరిగిపోతున్నాయి.కొన్ని గ్రామాలలో ప్రభుత్వ భూములు లేకపోవటంతో పాఠశాల ఆవరణలలోనే క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారు. అక్కడ విద్యార్థులు ఆడుకునే అవకాశాలున్న గ్రామపంచాయతీలు క్రీడా సామాగ్రిని ఇవ్వటం లేదు. ప్రభుత్వం అందించిన క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లు నిరుపయోగంగా మారాయి. గ్రామీణ క్రీడాకారులు ప్రభుత్వ పాఠశాల ఆవరణలలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలలో ఆడేందుకు విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగే పరిస్థితులున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

క్రీడా ప్రాంగణాలకు కేటాయించిన భూములను కొన్నిచోట్ల కొందరు కబ్జా చేస్తున్నారు. క్రీడా ప్రాంగణాలకు ఇరుగుపొరుగున ఉన్నవారు కొద్దికొద్దిగా భూములను కలుపుకుంటున్నారు. క్రీడా ప్రాంగణాలపై సరైనా పర్యవేక్షణ లేకపోవటంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

చర్యలు చేపట్టేనా?

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు. క్రీడా ప్రాంగణాలు చుట్టు ప్రహరీ గాని, ఐరన్ ఫెన్సింగ్ గాని వేయించి భూమిని కబ్జా కాకుండా రక్షించాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీలలో మూలనపడివున్న క్రీడాసామగ్రిని స్థానిక యువతకు అందిస్తే వారు తీరిక సమయాలలోనైనా క్రీడల పట్ల ఆసక్తి కనబరిచే అవకాశాముంది. క్రీడా ప్రాంగణాలను గాలికి వదిలేసి, క్రీడా సామగ్రిని మూలకు పడేసి ప్రభుత్వ లక్ష్యాలను నీరుకార్చే చర్యలు మానుకోవాలని కొందరు క్రీడాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

వినియోగంలోకి తీసుకురావాలి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి. క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉండటంతో ఆ భూమి కబ్జాకు గురవుతుంది. క్రీడా సామగ్రి గ్రామపంచాయతీలలో మూలకు పడివున్నాయి. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కోచ్‌లను నియమించాలి.

– కొడెబోయిన రవి, సారపాక

చర్యలు తీసుకుంటాం..



క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రామ పంచాయతీలలో ఉన్న క్రీడా సామగ్రిని కూడా స్థానికంగా యువతకు అందించేందుకు కృషి చేస్తాం. క్రీడల నిర్వహణకు ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు అవసరమైన వసతులను ఏర్పాటు చేస్తాం.

– సునీల్‌శర్మ, ఎంపీఓ

దుర్గంధం వెదజల్లుతోంది..


ములకలపల్లి ప్రధాన సెంటర్‌లో బీటీ రోడ్డుపైకి చేరిన మురుగునీరు

ములకలపల్లి: రోడ్లపైకి వస్తున్న మురుగునీటితో మండలకేంద్రం దుర్గంధం వెదజల్లుతోంది. ములకలపల్లి మెయిన్‌సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్ పనులు మొదలుకాగా, ఇటీవల ఇళ్ల ఎదుటగల అరుగులు, కాంక్రీట్ నిర్మాణాలను యంత్రాల సహాయంతో తొలగించి, గ్రామశివారుకు తరలించారు. దీంతో ఇన్నాళ్లూ మురుగునీరు బైటికి వెళ్లేలా రోడ్డుపక్కన తాత్కాలికంగా ఏర్పరచుకున్న చిన్నపాటి కాలువ పూడిపోయింది. దీంతో సమీప ఇళ్లకుచెందిన మురుగునీరంతా ప్రధాన రహదారిపైనే ప్రవహిస్తోంది. హోటళ్లు, చికెన్ సెంటర్లు, దుకాణాలు, నివాస ప్రాంతాలతోపాటు ఇతర వ్యాపారాలకు చెందిన నీటివ్యర్థాలు బీటీరోడ్డుపైకి చేరడంతో ఈప్రదేశంలో దుర్వాసన వస్తోంది. ఆటోలు, కార్లు, లారీలు వంటి వాహనాలు వెళుతున్న క్రమంలో రోడ్డుపై మురుగునీరు, పక్కనే వెళుతున్న పాదచారులు, ద్విచక్ర వాహనాలపై పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు బైటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పర్ణశాలలో అంకురార్పణ

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి తిరువారాధన, తదుపరి స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. నిత్య హోమం, స్వామివారికి విశేష ప్రసాద నివేదన, సోమవారం పౌర్ణమి సందర్భంగా డోలోత్సవం, వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నారు. దానిలో భాగంగా ముందుగా ముత్తయిదువుల చేత పసుపు కొమ్ములు కొట్టే కార్యక్రమం, తదుపరి శ్రీరామ నవమి కల్యాణానికి భక్తుల చేత తలంబ్రాలు కలిపే కార్యక్రమం నిర్వహించనున్నారు.అనంతరం ఆలయంలో వసంతోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. దానిలో భాగంగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మి పూజ నిర్వహించి, ముత్తైదువుల చేత కట్టించిన పసుపుతో చూర్ణం తయారుచేసి మూలమూర్తులకి ఉత్సవమూర్తులకు అర్చక స్వాములు సమర్పిస్తారు. తదుపరి స్వామివారికి ఉపయోగించే ద్రవ్యాలతో వసంతం తయారుచేసి స్వామివారికి సంప్రోక్షణ చేస్తారు. సాయంకాలం ఆరు గంటలకు తిరువారాధన, ఏడు గంటలకు స్వామి వారి తిరువీధి సేవ, ఎనిమిది గంటలకు విశేష ప్రసాద నివేదన భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ.

ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, అమరవాది వెంకట్రామన్, నరసింహాచార్యులు, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, ఉత్సవాల ముఖ్య అధికారి అనిల్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే విజయవంతం


ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరుటౌన్: మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో నిర్వహించిన లెప్రసీ సర్వే విజయవంతంగా ముగిసిందని నోడల్ పర్సన్ రాంప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు 14 రోజుల పాటు నిర్వహించిన ఇంటింటి సర్వేలో అనుమానిత కేసులను ఆరోగ్య శ్రీ కేంద్రానికి పంపినప్పటికీ ఒక్క లెప్రసీ కేసు నమోదు కాలేదని అన్నారు. ఆశా కార్యకర్తలు విజయకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రూపా స్కూల్ ఆవరణలో హైదరాబాద్ నార్త్ క్లబ్ వారి సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఆదివారం 10 మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ.. రోటరీ ఎల్లప్పుడు సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం సైకిళ్లు పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. కోశాధికారి విద్యాసాగర్, యశోద రాంబాబు, నాగేశ్వరరావు, మునికేశవ్, రఫీ, అజయ్‌కుమార్, బ్రహ్మరెడ్డి, వేణు, మధు, బాలాజీ, రవికుమార్, అజీమ్, వీరభద్రం, చలపతి, ప్రసన్నకుమార్, రాజేష్, శ్రీనివాస్, నరసింహారావు, రామకృష్ణ, హిందులీల, రాహుల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మణుగూరురూరల్: పట్టణానికి చెందిన డాక్టర్ పల్నాటి తిరుపతిరావు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి నివాసానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. డాక్టర్ తిరుపతిరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం అశోక్‌నగర్‌లో కాలేవారు ముత్తమ్మ దశదిశ కర్మలకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.సమితిసింగారం గ్రామంలో మృతి చెందిన ఎండి.జాఫర్ ఉల్లా మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళ్లర్పించారు. అలాగే మణుగూరు మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మందపాటి జగన్నాథరాజు అనారోగ్యంతో బాధపడుతూ.. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాస్పిటల్‌కు చేరుకుని జర్నలిస్ట్ మృతికి సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

నిశ్చయతాంబూలం వేడుకలో..

మండలంలోని పీవీకాలనీలోని వెంకటేశ్వరస్వామి సన్నిధిలో పట్టణస్తులు పోశం సత్యనారాయణ–సుజాత దంపతుల కుమార్తె సౌజన్య– సాయికుమార్‌ల నిశ్చయతాంబూలం వేడుకకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా నిర్వహించాలి

మణుగూరురూరల్: పర్యావరణహితంగా హోలీ పండుగ వేడుకలను జరుపుకోవాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. ఆదివారం ఆయన ఏరియా ఉద్యోగులకు, అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ వేడుకలకు రసాయన రంగులను కాకుండా సహజసిద్ధమైన రంగులను వాడాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

భద్రాచలంటౌన్: పట్టణ ప్రజలు హోలీ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. యువత హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. గోదావరి స్నానానికి వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, ఇతరులకు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

టెట్ ఫీజు భరించాలి

చండ్రుగొండ: టెట్ ఫీజును ప్రభుత్వమే భరించాలని స్థానిక నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వారు విలేకరులతో మాట్లాడుతూ.. టెట్ పరీక్ష కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఫీజు వసూలు చేస్తుందని, నిరుద్యోగుల పాలిట ఈ ఫీజు భారంగా పరిణమించిందని ఆవేదన వ్యకం చేశారు. పెంచిన ఫీజు తగ్గించాలని లేనిపక్షంలో ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాయి రాజా, ఇల్లంగి బాలకృష్ణ, బడుగు సాయి, నిమ్మల పద్మాష్, ఎలమందల శ్రీనివాసరావు, కావ్య, కిషోర్ పాల్గొన్నారు.

నేడు బాలాజీ కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని సోమవారం రాత్రి 10 గంటలకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఆలయంలో అగ్నిప్రతిష్ఠ, హవనం, గరుడపటాధివానం, పారాయణాదుల, ధ్వజారోహణ, భేరీపూజా, దేవతాహ్వానం మొదలైన పూజా కార్యక్రమాలను గిరిధరాచార్యుల ఆధ్వర్యంలో అర్చకబృందం ఘనంగా జరిపించారు. గరుడ పటాధివానం సందర్భంగా ఆలయంలో సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం అందజేశారు. స్వామి వారి పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

30న 'బార్' ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం బార్ అసోసియేషన్ ఎన్నిక నామినేషన్ల పరిశీలన ముగియడంతో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను ఎన్నికల అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం ప్రెసిడెంట్ పదవికి కె.దేవదానం, టి.చైతన్య వైస్ ప్రెసిడెంట్ పదవికి ఎమ్‌వీ.రమణ, కె.నవీన్‌తో పాటు మరికొందరు పోటీపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30న ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

అశ్వాపురం: మల్లెలమడుగు గ్రామంలో పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బారాజు సంపత్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా డ్రెయినేజీ పనులు


అసంపూర్తిగా మిగిలి ఉన్న డ్రెయినేజీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొండికుంట గ్రామంలో రూ.1.51 కోట్లతో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించారు. డ్రెయినేజీ పనులు పూర్తి స్థాయిలో పూర్తి చేయకుండా అసంపూర్తిగా ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ మధ్య మధ్యలో పై కప్పు వేయకుండా వదిలేయడంతో దోమలు విజృంభిస్తూ దుర్వాసన వస్తూ వ్యాపారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. దోమల వల్ల జ్వరాలు, వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు, హోటళ్ల ముందు మధ్య మధ్యలో డ్రెయినేజీపై కప్పు మూసివేయకపోవడంతో ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి డ్రెయినేజీ పనులు పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. వేసవికాలం రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

కనీస వేతన జీఓను సవరించాలి

భద్రాచలంటౌన్: ప్రభుత్వ ఆసుపత్రుల వర్కర్ల కనీస వేతన జీఓను సవరించి 5 నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి అన్నారు. ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 12 ఏళ్లుగా కనీస వేతనాల జీఓల సవరణ జరగలేదని, దీని వల్ల రెండు సార్లు వేతనాల పెరుగుతలను కార్మికులు నష్టపోయారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత రెండు సార్లు పీఆర్సీని ప్రకటించిన ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు మాత్రం కనీస వేతనాల జీఓను సవరించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నోటిఫికేషన్‌లో అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.12,935 వేతనాన్ని నిర్ణయించడం చాలా అన్యాయమని అన్నారు. కార్మికుల అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్లకు సవరణలు చేసి కనీస వేతనాలు న్యాయబద్ధంగా నిర్ణయించి ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయాలని, లేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో రమణ, కుమారి, చిట్టెమ్మ, హైమ, శాంతమ్మ, కృష్ణ, నర్సింహా, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి కొలుపు


హాజరైన భక్తజనం

ములకలపల్లి: మండలపరిధిలోని మాధారం గ్రామంలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి కొలుపు ముగిసింది. ఆరు రోజులపాటు నాయకపోడు సామాజికవర్గం నిర్వహించే ఈ వేడుకలో సమీప గ్రామాల్లో పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ఊరేగించారు. ఉత్సవంలో బాగంగా శనివారం సమీప అడవుల నుండి సరువులను తీసుకొచ్చారు. వీటికి సంప్రదాయ పద్ధతిలో పూజాక్రతువు నిర్వహించి, అర్ధరాత్రివేళ ప్రత్యేక పందిరి మీదకు చేర్చారు. ఆదివారం గణాచారులు పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి అంకమైన నిప్పుల గుండం వద్ద భారీగా భక్తులు హాజరయ్యారు. దీంతో ప్రాంతం భక్తజన సంద్రమైంది. జయజయ ధ్వానాల నడుమ కణకణలాడే అగ్నిగుండం తొక్కి, ఆలయంలోకి ప్రవేశించారు. తల్లికి చీరె. సారెలతో మొక్కులు చెల్లించారు. గంపా బోడయ్య, కురం రాజు, సందీప్, ముదిగొండ కృష్ణ, గంపా చుక్కయ్య, కంకటి అక్కమ్మ, పసుల బుచ్చమ్మ, గంపా సత్యం, పసుల రాజసూర్య, కురం రాజుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, సురభి రాజేశ్, పాలకుర్తి సుమిత్ తదితరులు దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


చర్ల: మట్టలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

చర్ల: మట్టల ఆదివారాన్ని చర్ల మండలంలో క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్షలలో ఉన్న క్రైస్తవులు ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుకుంటారు. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న సీఎస్ఐ, బైబిల్ మిషిన్, రాక్ ఇంటర్నేషనల్, జీటీఎస్ఎస్ఎస్ తదితర సంఘాలకు చెందిన క్రైస్తవులు వారి వారి గ్రామాల్లో కర్జూర, ఈత మట్టలతో గ్రామాల్లో శోభాయాత్రలను నిర్వహించారు. అనంతరం చర్చీలలో మట్టలాదివారపు ప్రత్యేక ప్రార్దనలు నిర్వహించగా పాస్టర్లు మట్టలాదివారపు ప్రాముఖ్యతను బైబిల్ ఆధారంగా వివరించారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అల్లిగూడెం, దిబ్బగూడెం, రామన్నగూడెం, అశ్వారావుపేటలో మట్టల ఆదివారాన్ని ఘనంగా జరిపారు. ఆయా ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్దనలు చేశారు. మట్టల పండుగ సందర్భంగా ఖర్జూరపు మట్టలను చేతిలో పట్టుకొని ప్రధాన వీధుల్లో ప్రదర్శనలు చేశారు. అలాగే క్రైస్తవ గీతాలను ఆలపించారు. పాస్టర్ సియోను కుమార్, సువార్త, రమేష్, నెహ్రు, జైపాల్, ప్రభుదాసు, కిషోర్, సుధాకర్, కుమారి రూతు, జ్యోతిరాణి, సంఘస్తులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, దైవం పట్ల భీతితో ప్రతి మనిషి జీవించాలని ఎవలాంజలిస్టు జాన్సన్ అన్నారు. మండలంలోని గానుగపాడు గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం మట్టల పండుగ ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు ఈత మట్టలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జాన్సన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో రేవరెండ్ ఎం.దేవదానం పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: ప్రార్థనలు చేస్తున్న పాస్టర్, సంఘస్తులు


చండ్రుగొండ: ఈత మట్టలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు